

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం: ఈనెల 8, 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్య.కా.స రాష్ట్ర 29వ మహాసభను పురస్కరించుకుని మండలంలోని మాధవరంలో సంఘ పతాకాన్ని నాయకులు కొడవటి వెంకటరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం మహానేత పుచ్చలపల్లి సుందరయ్య 1934లో ఏర్పాటు చేశారని తెలిపారు. నాడు దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీల భూమి, కూలి, ఇల్లు, ఇళ్ల స్థలాలు, ఉపాధి వంటి సమస్యలపై నిరంతర పోరాటాలు చేశారని తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెంలో వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో మాజీ ఎంపీ బృందాకరత్, సంఘం ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు విజయరాఘవన్, బి.వెంకట్, రైతు సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని, సభకు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై

వేటు తప్పదా..!

పదేళ్లలోపు సర్వీసున్నవారిని తొలగించేందుకు ఆదేశాలు

ఆందోళనలో ఉమ్మడి జిల్లాలోని మూడువేల మందికి పైగా ఉద్యోగులు

పదేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులు 30శాతం వరకూ ఉన్నట్లు అంచనా

తమ పరిస్థితి ఏమిటంటూ అంతా లబోదిబో

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకొస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామంటూ వైసిపి ఇచ్చిన హామీ నేడు గాలికొదిలేసింది. ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా ఉన్నవారిని తొలగించేందుకు పూనుకుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఆదేశాలు సైతం జారీచేయడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడువేల మందికిపైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లపై వేటు పడనుంది. ఇది ఇంతటితో ఆగుతుందా, ఇతర ఉద్యోగులపైన కూడా పడుతుందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల్లో వైసిపి హామీ ఇవ్వడంతో, ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందని అంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.12 వేల నుంచి రూ.20 వేలలోపు జీతాలు చెల్లిస్తున్నారు. పెరిగిన ఖర్చులతో జీతాలు ఏ మాత్రమూ చాలకపోయినా ఏదోఒకరోజు ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయనే ఆశతో వారంతా ఎదురుచూస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు రూ.లక్షల్లో జీతాలు అందుకుంటున్నప్పటికీ పనంతా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకే అప్పగిస్తారు. రాత్రీ, పగలు తేడా లేకుండా వీరంతా కష్టపడుతుంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న మూడువేలకుపైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పదేళ్లలోపు సర్వీసున్నవారు 30 శాతం మంది ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు జరిగితే ఈ జిల్లాలోనే వెయ్యిమందికిపైగా ఉద్యోగులు ఇంటిబాట పట్టే అవకాశం ఉంటుంది. వీరిలో అత్యధికంగా 35 ఏళ్లు పైబడిన వారే ఉన్నారు. ఇన్నేళ్లు పనిచేసిన తర్వాత ఉన్న ఫళంగా తొలగిస్తే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని అంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన తర్వాత అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల్లో కంటిమీద కునుకులేకుండాపోయింది. తమ బతుకులు ఏదారి చేరతాయోనన్న భయం అందరినీ వెంటాడుతోంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు మీడియాలో వచ్చిన తర్వాత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దంటూ వైసిపి నాయకులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వపరంగా ఆదేశాలు మాత్రం జారీచేయలేదు. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేస్తారా.. వెనక్కి తగ్గుతారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తేనే ఉద్యోగుల్లో ఆందోళనలు తొలగుతాయి. అలాకాకుండా ప్రభుత్వం బుజ్జగించే కబుర్లు ఎన్ని చెప్పినా ఉద్యోగుల్లో నమ్మకం కలిగే పరిస్థితి ఉండదు. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఏమాత్రమూ కనికరం లేకుండా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఉద్యోగులను పర్మినెంట్ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.





ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉద్యోగులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మెరుపు ధర్నా నిర్వహించారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు తాత్కాలికంగా స్థానం కేటాయించాలని, అసంబద్ధ పని సర్దుబాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో విద్యావ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ప్రమోషన్లకు అంగీకారం తీసుకొని వారికి స్థానాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. సాధారణ బదిలీలు నిర్వహించాల్సిన ప్రభుత్వం బదిలీలు నిర్వహించకుండా తాత్కాలిక సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను దూరప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పని సర్దుబాటు పేరుతో 117 జిఒని అమలు చేస్తూ ఉపాధ్యాయుల సంఖ్యను భారీగా కుదిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే డిఎస్‌సి ద్వారా నియామకాలు చేపట్టి, ప్రమోషన్లు ఇచ్చి సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించాలి తప్ప మసిపూసి మారేడు కాయ చేసి ఎక్కడ లేని లెక్కలను చూపిస్తూ ఉపాధ్యాయ సంఖ్యలను కుదించి పని సర్దుబాటు చేయడం తగదన్నారు. వెంటనే అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులకు తాత్కాలిక పద్ధతిలో స్థానాలు కేటాయించాలని, పని సర్దుబాటును నిలుపుదల చేసి బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, ఎకెవి రామభద్రం, అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, కోశాధికారి పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్.సాయిరాం, డి.ఏసుబాబు, కెఎస్.రామకృష్ణ ప్రసాద్, పి.క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిలర్స్ రామానుజరావు, కుమార్ బాబ్జీ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు దారుణం

తక్షణం రెగ్యులర్ చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు సరికాదని, వారిని వెంటనే రెగ్యులరైజేషన్ చేసి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన అనంతరం దాదాపు 90 వేలమంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా వచ్చారన్నారు. వీరందరికీ అరకొర జీతాలే ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అధికంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన వారే ఉన్నారన్నారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కష్టాలను తీరుస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, వారి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. కానీ దానికి భిన్నంగా పదేళ్లలోపు సర్వీసున్న అందరినీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలుస్తోందని, దీనివల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేస్తారని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కానీ వారి ఆశలపై నీళ్లు చల్లేలా చర్యలు చేపట్టడం దారుణమని పేర్కొన్నారు. వారిని రెగ్యులర్ చేస్తారనే నమ్మకంతో ఎన్నికల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ వైసిపికి ఓట్లు వేసి, ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారన్నారు. కానీ ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

వయోపరిమితి పెంచాలి

భీమవరం: ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతికి డివైఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం 6700 ఎస్ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మూడు సంవత్సరాల నుంచి నోటిఫికేషన్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్న ప్రభుత్వం ఎట్టకేలకు 6500 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. దీనిలో 6100 కానిస్టేబుల్ ఉద్యోగాలు 400 ఎస్సై ఉద్యోగాలు ఉన్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాకపోవడంతో లక్షలాది మంది యువత వయసు లేదు అనే కారణంతో ప్రస్తుతం అనర్హులుగా మారారని తక్షణం ప్రభుత్వం అభ్యర్థుల వయోపరిమితిని ఐదేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే చాలా సిలబస్ ఉన్నందువల్ల ఒక్కసారైనా సిలబస్ మొత్తాన్ని చదవాలి అంటే కనీసం మూ డు నెలలు పైబడి సమయం పడుతుందని, పరీక్ష గడువును నెల రోజులు వాయిదా వేయా లని కోరారు. సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం 20,100 ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అన్ని రకాలుగా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రీ సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- భీమవరం

జిల్లాలో భూ రీ సర్వే ప్రారంభించే గ్రామాల్లో ముందుగా ఫీల్డ్ పిఒఎల్ఆర్ ప్రారంభించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 16 గ్రామాల మినహా మిగిలిన 277 గ్రామాల్లో ఫీల్డ్ పోలార్ ఫాలర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా గ్రామ చిత్రపటం ప్రింట్ తీసి దానిలో రైతుల కమతాలు, సరిహద్దులు గుర్తించి రీసర్వే ప్రక్రియ ప్రారంభం కాకముందే గ్రౌండ్ వ్యాల్యుడేషన్ పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం వంద రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి జెవి.మురళీ, ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్ లే అవుట్‌ను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

విస్సాకోడేరు పంపుల చెరువు వద్ద భీమవరం అర్బన్ లే అవుట్‌ను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసి గృహ నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. గృహనిర్మాణ శాఖ అధికారులను లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లే అవుట్‌లో గృహ నిర్మాణానికి సంబంధించి ఎంత మంది లబ్ధిదారులున్నారు?, ఎంతమంది గృహాలు నిర్మించుకున్నారు, బేస్‌మెంట్ స్థాయిలో ఎన్ని ఉన్నాయి? రూఫ్ స్థాయిలో ఎన్ని ఉన్నాయి? ఎన్ని ఇళ్లు పూర్తి అయ్యాయి? వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ లే అవుట్‌లో 3,116 గృహాలుండగా అందులో 120 మాత్రమే ప్రారంభించారని, మిగిలిన గృహాలు కూడా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు అల్లూరి వెంకట రామరాజు, ఇఇ బివి.వెంకట రమణ, పురపాలక సంఘం కమిషనరు ఎస్.శివరామకృష్ణ, మునిసిపల్ ఇంజనీరు పి.త్రినాథరావు, పి.గౌరు, ఎఇ సాంబశివరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలి



పెనుగొండ తహశీల్దార్ గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - పెనుగొండ

మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన సంఘం మండల అధ్యక్షులు మన్నె వెంకట్రావు మాట్లాడుతూ పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలివ్వాలని, మెనూ ఛార్జీలు పెంచి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, పథకానికి బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీల నిమిత్తం ప్రతి విద్యార్థికీ రూ.20 ఇవ్వాలని, గుర్తింపు కార్డులిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దఫదఫాలుగా మెనూ తయారుచేసి వర్కర్లపై పని భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. వంట పాత్రలు లేవని, గ్యాస్ ధరలు పెరగడంతో వర్కర్లపైనే భారం పడుతోందన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, కోళ్ల విజయలక్ష్మి, రాజేశ్వరి కార్మికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

పాలకోడేరు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భోజన కార్మికుల నాయకురాలు దున్న మరియమ్మ, సిపిఎం మండల కార్యదర్శి అసిరియా మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం నిర్వహణకు సంబంధించి సమయానికి బిల్లులు మంజూరు చేయాలన్నారు. పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, పని భారాన్ని తగ్గించాలని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారికి అందజేశారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



పెనుగొండ తహశీల్దార్ గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నేతలు

సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందన ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 183 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు జెవి.మురళి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, భీమవరం డిఎస్‌పిబి.శ్రీనాథ్ దరఖాస్తులు స్వీకరించారు.



ప్రజల నుంచి సమస్యలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రెడ్ క్రాస్‌లో ఎక్కువ మంది సభ్యులు చేరాలి

జిల్లా అధ్యక్షులు ఎంఎస్‌వి.శివరామభద్రిరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా అధిక సంఖ్యలో చేరి ఫండ్ సమకూర్చాలని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్‌వి.శివరామభద్రిరాజు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లా అధికారులందరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారి నూతనంగా ఏర్పడిన జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు అత్యధిక మొత్తంలో నిధులు సమకూర్చేందుకు సహకరించాలని కోరారు. రెండు లక్షల రూపాయల ఫండ్ సమకూర్చిన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. తణుకు, నరసాపురంలో రెండు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని, నూతనంగా భీమవరంలో ఎఎస్ఆర్‌నగర్ లో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నామని అందులో ఎక్విప్‌మెంటుకు ఇండియన్ రెడ్ క్రాస్ 1 కోటి రూపాయలు మంజూరు చేసిందని, పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు పి.ప్రశాంతి, జెసి జెవి మురళి, ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు, డిపిఒఎం నాగలత, డిఎల్‌డిఒ అప్పారావు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని నాగదేవత కాలనీలో విద్యుత్ స్తంభాలు వేయించాలని రెవెన్యూ కార్యాలయం వద్ద కాలనీవాసులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. జగన్ హయాంలో ఇచ్చిన జగనన్న కాలనీలకే సౌకర్యాలు కల్పిస్తూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కాలనీలకు మౌలిక సదుపాయాలు విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ తదితర వాటికి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న పేదల ఇళ్లకు బకాయి బిల్లులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాగ దేవత కాలనీకి విద్యుత్ స్తంభాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం ఇఒపిఆర్‌డి నవీన్‌కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎడ్ల చిట్టిబాబు, కాలనీవాసులు కాళ్లకూరి యేసు, మన్నె సాయి, తత్తూరి ఏసు, మహిళలు పాల్గొన్నారు.



ఇఒపిఆర్‌డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పెదమల్లంలో 90వ రోజు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ 17.50 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్‌కు భూమి పూజ చేశారు. అనంతరం లంక గ్రామ రైతుల సౌకర్యార్థం రూ.2.50 లక్షలతో తన సొంత ఖర్చులతో నూతనంగా ఏర్పాటు చేసిన పడవను ప్రారంభించి రైతులకు అందజేశారు. అనంతరం లంక గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ పేదలందరికీ అందుతున్నాయన్నారు. పింఛన్లు, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, నేతన్న నేస్తం, రైతు భరోసా తదితర పథకాలన్నీ అర్హులైన పేదలందరికీ అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. లంక గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా, రహదారులను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచి దిరిశాల విజయలక్ష్మి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, నాయకులు జవాది పరమేష్, కొండేటి భవాని ప్రసాద్, పండు, ఎస్.పెద్దిరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

స్వేచ్ఛ, సమానత్వం కాగితాలకే పరిమితం

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజ్యాంగం కల్పించిన లింగ సమానత్వం, స్వేచ్ఛ, హక్కులు, మహిళా స్వాతంత్ర్యం కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. సోమవారం వాసవీ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో జరిగిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా వస్తున్న సమాజ కట్టుబాట్లను ఛేదించుకొని అన్ని రంగాల్లో అందిపుచ్చుకున్న వనితాలోకం ఇప్పుడిప్పుడే హక్కులు, సమానత్వం, ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులేస్తోందన్నారు. మరో వైపు సమాజంలో పెరుగుతున్న పెడధోరణులు వారి ప్రగతికి అవరోధంగా మారడమే కాకుండా ఎందరినో బలి తీసుకుంటున్నాయన్నారు. మహిళల భద్రత కోసం ఎన్నో చట్టాలున్నా అవి అక్కరకు రావడం లేదన్నారు. స్త్రీని చిన్న చూపు చూడడమే కాకుండా వారికి ఇచ్చిన 33 శాతం రిజర్వేషన్ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. స్త్రీని కించపర్చి తక్కువ చూపు చూస్తూ మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.యశోద, సత్యవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు పూర్ణ



జెండాను ఆవిష్కరిస్తున్న చిన వీరభద్రరావు, నాయకులు కె.సుబ్బరాజు

వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇల్ల చిన వీరభద్రరావు, నాయకులు కె.సుబ్బరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ పతాకాన్ని స్థానిక బ్రాహ్మణ చెరువు వాటర్ ట్యాంకు వద్ద ఎగరవేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, సుబ్బరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేరళ రాష్ట్రంలో వాటర్ల్ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు ఆ తరహాలో మన రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన జరిగే మహాప్రదర్శన, బహిరంగ సభలో పెద్దఎత్తున వ్యవసాయ కార్మికులు, పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడి శ్రీనివాస్ ప్రసాద్, ఎస్.ధనలక్ష్మి, బొక్క మని, కొప్పిశెట్టి మంగాదేవి, కోడి లక్ష్మి, కొప్పిశెట్టి నాగమణి పాల్గొన్నారు.

ఇంటి రుణం రూ.5 లక్షలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి - ఉండి

జగనన్న కాలనీలో నిర్మించే ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పరచిందని, వాటిలో ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 1,80,000 రూపాయలు సరిపోవని రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కాలంలో సిమెంట్, ఇసుక, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని దీనివల్ల పేదవాడి సొంతింటి కల అడియాసలవుతోందని తెలిపారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ససవల శ్రీనివాస్, పతివాడ గణపతి, తమరాణి శ్రీనివాస్, షేక్ బాబుజీ, కోన గొల్లయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

చిన్నతనం నుంచే పిల్లల్లో సేవాభావం అలవాటు చేయాలని లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ ఎన్విఎస్ పాపారావు తెలిపారు. స్థానిక జిబిఎన్వీఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ లియో వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా లియో క్లబ్ ద్వారా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు కామేశ్వరరావు, హెచ్ఎం రాయపురెడ్డి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బడుగుల ఆశాజ్యోతి సిఎం జగన్'

ప్రజాశక్తి - ఆచంట

బిసిలు అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు,'బ్యాక్ బోన్ క్లాస్'గా మార్చిన సిఎం జగన్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. సోమవారం ఆచంట విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద బిసి కుల వృత్తుల్లో ఉన్నవారికి రూ.10 వేల చొప్పున నేరుగా వారి ఆకౌంట్లోనే రూ.10 వేలు జమ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రం మొత్తం రూ.600 కోట్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగనదే అన్నారు. ఈ పథకం కింద ఏటా సొంత మగ్గాలు ఉన్న నేత కార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ. 24 వేలు నేరుగా జమ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. దేశం, బడుగు బలహీన వర్గాల వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించే విధంగా సిఎం అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.



పాలమూరు నుండి బ్రాహ్మణ చెరువు రహదారికి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాలమూరు రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాలమూరు నుంచి బ్రాహ్మణచెరువు రహదారికి సోమవారం మరమ్మతులు చేపట్టారు. దాదాపు నాలుగేళ్ల క్రితం వేసిన ఈ రహదారి ప్రస్తుతం రాళ్లు పైకి లేచి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలంటేనే భయపడిపోతున్నారు. ఇటీవల ఈ రోడ్డును నిర్మించాలని కెవిపిఎస్, డివైఎఫ్ఐ, రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బ్రాహ్మణచెరువు నుంచి పొలమూరు వరకూ బైక్ ర్యాలీ, పాలమూరు నుంచి నెగ్గిపూడి సెంటర్ వరకూ పాదయాత్ర చేశారు. ప్రస్తుతం అధికారులు రూ.13 లక్షల చేపడుతున్నట్టు ఇన్ఛార్జి ఆర్అండ్‌బి ఎఇ యశ్వంత్ అన్నారు. అయితే నూతన రహదారి నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

నేడు టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల ఆరో తేదీన మార్టేరు వేణుగోపాల ఆడిటోరియం ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమితులైన సభ్యులకు, జిల్లా పార్టీ కమిటీ, అనుబంధ కమిటీల్లో నియమితులైన సభ్యులకు, నియోజకవర్గ స్థాయిలో టిడిపి, అనుబంధ కమిటీల అధ్యక్షులు, సభ్యులకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు.

నాడు - నేడు నిధులతో పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి - కాళ్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాఠశాలలకు మహర్దశ వచ్చిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్లకూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఆయన సోమవారం భూమి పూజ చేశారు. సోమారాజు గరువులో రూ.14 లక్షలతో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి పివిఎల్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ నాడు- నేడులో భాగంగా రెండో విడత రూ.24 లక్షల నిధులు మంజూరు కావడంతో అదనపు గదుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడత నిధులు రూ.24 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, పార్టీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, వైసిపి సీనియర్ నాయకులు పి.సోమరాజు, గాదిరాజు లచ్చిరాజు, వేగేశ్న విజయరామరాజు, పెద్ద బుజ్జి పాల్గొన్నారు.



నేలను సంరక్షించాలి

నరసాపురం టౌన్ : వైఎన్ కళాశాలలోని సామాజిక సేవా విభాగం, భూగోళ శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ నేల (మత్తికా) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అప్పన ఫణి మాట్లాడుతూ నేలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, కళాశాల డీన్ గంథం రామకృష్ణ, సామాజిక సేవా విభాగం సమన్వయకర్త భీమడోలు ప్రసాద్ పాల్గొన్నారు.



నరసాపురం టౌన్ : ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉండి : వ్యవసాయానికి వీలు కాని భూములను మాత్రమే రొయ్యల సాగుకు వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, విద్యార్థులకు నేల దాని ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో రొయ్యల సాగు విపరీతంగా పెరిగిపోయిందని, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల భూములు చౌడుబారి వాటి సాంద్రత కోల్పోతున్నాయన్నారు. అందువల్ల వ్యవసాయానికి అనువు కాని భూములను మాత్రమే రొయ్యల సాగుకు ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు జి.నవీన్ కుమార్, కెవికె సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు పరిశోధన సంస్థలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కెఎం.దక్షిణామూర్తి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు దక్షిణామూర్తి, శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పర్యావరణ హిత కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ అసోషియేట్ (నేల శాస్త్రం) శివదేవిక, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : బివి.రాజు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వరల్డ్ సోయిల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఐఆర్‌కె.రాజు, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్‌వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు నేల ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. అనంతరం కాలేజీ క్యాంపస్ ఆవరణలో మొక్కలు నాటారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని పిహెచ్‌సి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ట్రయల్ రన్ కార్యక్రమం సోమవారం భగ్గేశ్వరం హెల్త్ అండ్ వెలనెస్ సెంటర్ వద్ద నిర్వహించారు. డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ వైద్య సేవలు అందించి మాట్లాడారు. రోజూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పి ఎఎన్ఎంలు, ఆశాలు వైద్య సేవలందిస్తారని తెలిపారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, చిన్న పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు గల వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్లు ఎస్కే అమలేశ్వరరావు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావుతో కలిసి సోమవారం నిర్వహించారు. వారు టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు లంకలకోడేరు గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా, ఏ వీధికి వెళ్లినా మా పెన్షన్లకు ఇదేం ఖర్మ అని జనం అంటున్నారని తెలిపారు. రేషన్ కార్డు కట్ చేస్తున్నారని, రేషన్ కార్డు తీసేస్తే పథకాలు ఎలా వర్తిస్తాయని స్థానికులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రోడ్ల అధ్వానంగా ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల జీవితాలు బాగుండాలంటే మరలా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడి విజయభాస్కర్, పాముల రజని, అందే కోటి వీర భద్రం, నీల్లా వీరభద్రం, సర్పంచి చొప్పల రజని పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీనీ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 32 ఫిర్యాదులు స్వీకరించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాలంలో పరిష్కరించాలని, అర్జీదారుడు సంతోషం వ్యక్తం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ జీతాలు పెంచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్లు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పెనుగొండ సర్కిల్లో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇప్పటికి శ్రమకు ఫలితం దక్కిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కుసుమే సురేష్ బాబు, వి.సత్యనారాయణ, కె.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

పాములపర్రు గ్రామానికి చెందిన దర్శి సాల్మన్‌రాజు తన కుమార్తె దర్శి సంధ్య అదృశ్యమైందని సోమవారం ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. పాములపర్రు గ్రామానికి చెందిన దర్శి సాల్మన్ రాజు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా గ్రామంలోని చర్చికి వెళ్లగా మధ్యాహ్నం2.30 నిమిషాల సమయంలో పెద్ద కుమార్తె సంధ్య ఇంటికి వెళ్లి పోతున్నానని చెప్పి వెళ్లింది. అప్పటినుండి కనబడడం లేదనితన సెల్ఫోన్ సైతం ఇంటిలోనే వదిలేసిందని, తన ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్ళ వద్ద వెతకగా ఇప్పటి వరకు ఆచూకీ తెలియలేదని దీనిపై తండ్రి సాల్మన్ రాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విధులకు గొరగనమూడి వెల్ఫేర్ అసిస్టెంట్ గైర్హాజరు!

ఐదు రోజుల నుంచి ఇదే పరిస్థితి
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పాలకోడేరు

సామాన్య ప్రజలకు సమర్ధవంతమైన సేవలను మరింత చేరువ చేయాలని ముఖ్యోద్దేశంతో వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ఉద్యోగ అవకాశాలను కల్పించింది. అయితే కొంతమంది సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి గండుకొడుతూ సామాన్య ప్రజానీకానికి పౌర సేవలు దూరం చేస్తున్నారు. అయితే దీనికి కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు వత్తాసు పలుకుతూ సచివాలయ ఉద్యోగులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వారిని వెనకేసుకొస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనమే గొరగనమూడి సచివాలయంలో జరిగిన సంఘటనే నిదర్శనం. స్థానిక సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.గోపాలకృష్ణ ఐదు రోజులుగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన గ్రామస్తులు నిరాశగా వెనుతిరుగుతున్నారు. అయితే గోపాలకృష్ణ ఆరోగ్యం బాగోలేద రెండు నెలల పాటు మెడికల్ లీవ్ పెట్టారు. సెలవులు పూర్తయిన తరువాత నవంబరు 15న తిరిగి విధులకు హాజరై 30వ తేదీ వరకూ విధులు నిర్వహించారు. అయితే మరలా రెండు నెలలు సెలవు కావాలని నవంబర్ 30న గ్రామ కార్యదర్శి పోలయ్యకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి పోలయ్య సెలవు ఇచ్చే అధికారం తనకు లేదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నుంచి సెలవు మంజూరు చేసుకోవాలని సంబంధింత వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలకృష్ణకు సూచించారు. అయితే గోపాలకృష్ణ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సెలవు మంజూరు చేసుకోకుండానే విధులకు హాజరు కాకుండా గైర్హాజరయ్యారు. ఐదు రోజుల నుంచి విధులకు హాజరు కాకుండా ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం అందించకుండా గోపాలకృష్ణ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్‌పై అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు వ్యక్తమవుతున్నాయి. 5 రోజుల నుంచి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లేనప్పటికీ కనీసం మరో వెల్ఫేర్ స్టంట్‌కు బాధ్యతలు అప్పగించకపోవడం పట్ల విమర్శలకు తావిస్తోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి పోలయ్యను వివరణ కోరగా నవంబర్ 30న వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవు కోసం లేఖ రాశారని చెప్పారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వద్ద సెలవు తీసుకోవాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సూచించానని తెలిపారు. ఆయన ఎటువంటి సెలవు తీసుకోకుండానే విధులకు గైర్హాజరు కావడం వాస్తవమేనని తెలిపారు. దీనిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారికి నివేదిక అందించామని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళి గంగాధర్‌ను వివరణ కోరగా వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ పెట్టుకున్న సెలవు దరఖాస్తును తిరస్కరించామన్నారు. సెలవు మంజూరు కాకుండా విధులకు గైర్హాజరు కావడం పట్ల సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్‌ను వివరణ కోరుతూ పంచాయతీ కార్యదర్శి కీ సిఫార్సు చేసినట్లు తెలిపారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



గొరగనముడి సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ కుర్చీ

నన్ను బతికించారు..

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు నాగేశ్వరరావు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నాకు కరోనా సోకగానే ఆసుపత్రిలో బెడ్ ఇప్పించి మెరుగైన వైద్యం అందించే విధంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ చర్యలు తీసుకుని నన్ను బతికించారని వాతాడి నాగేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలం దెయ్యాల తిప్ప గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో నాగేశ్వరరావు స్వయంగా తన ఇంటి వద్ద నిలబడి ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ బాధితులకు అండగా నిలబడి అనేకమంది ప్రాణాలను రక్షించిన విషయం ప్రజలకు తెలిసిందే. అయితే ఆనాడు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ద్వారా ప్రాణాలు నిలుపుకున్న వారు నేడు గత కరోనాలో జరిగిన మేలును మర్చిపోకుండా స్వయంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటు నమోదుపై బిఎల్ఒలకు అవగాహన

ప్రజాశక్తి - ఉండి

18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని బూత్ లెవెల్ అధికారులకు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ స్వామి నాయుడు పలు సూచనలిచ్చారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ స్వామి నాయుడు అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటు నమోదులో తప్పు, ఒప్పుల సవరణ, చిరునామా మార్పు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మరణించిన, పెళ్లి చేసుకుని వేరే ఊరు వెళ్లిన వారి ఓటును తొలగించడానికి సర్వే చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా నాగరాజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి మండల నూతన అధ్యక్షునిగా కరిమెరక నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మోపిదేవి శ్రీను అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించిన మండల స్థాయి విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు మంతెన రామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. మండలంలోని అందరు ఏకాభిప్రాయంతో నాగరాజు పేరును ఖరారు చేయడంతో మండల పార్టీ అధ్యక్ష పదవి ఏకగ్రీవం అయ్యిందన్నారు. నాయకులు, కార్యకర్తలు నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసేవరకూ కృషి చేయాలన్నారు. కరిమెరక నాగరాజు సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గత 15 సంవత్సరాల నుండి మండల అధ్యక్షునిగా క్రమశిక్షణతో పార్టీని బలోపేతం చేసిన జుత్తిగ శ్రీనివాస్‌కు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆయన తెలిపారు. అనంతరం జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో యువతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో తాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నానని, నూతన అధ్యక్షునికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడు కరిమెరక నాగరాజు మాట్లాడుతూ పార్టీ తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సీనియర్ల సహకారంతో సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.